గంటసేపట్నించీ పిక్కబలం ఉపయోగించి 'అప్పెక్కే' రిక్షాబాబులా తొక్కుతున్నా ఎక్సర్‌సైజ్ సైకిల్ మీది మీటర్ మాత్రం ముదనష్టంగా మూడే మూడు కిలోమీటర్లు చూపిస్తోంది. నిమిషాలు యుగాల్లా గడవడం ప్రేమలో పడ్డ వాళ్లకే కాదు ఇలా ఎక్సర్‌సైజ్‌లు చేసేవాళ్ల క్కూడా అన్న నగ్నసత్యం అప్పుడే బోధపడింది నాకు. పక్కనే ఉండి సూపర్‌వైజ్ చేస్తున్న నా శ్రీమతి జలజకి అంత తృప్తిగా అనిపించకపోయినా కుక్కర్‌లా వేడెక్కి విజిల్స్ వేస్తున్న నా అవస్థ చూసి, "సర్లెండి! ఇవాల్టికి చాలుగానీ ఇంక రండి వాటర్ థెరపీకి!" అంటూ కిచెన్లోకి నడిపించింది నన్ను. నాలుగురోజుల క్రితం దాకా అందర్లా బాగానే ఉండేది నా బతుకు. కొంచెం బొద్దుగా నేను, నాజూగ్గా మా ఆవిడ, అల్లరల్లరిగా బుజ్జిగాడూ... హ్యాపీగా ఉండే వాళ్లం. ఓ రోజెందుకో తలనెప్పిగా ఉంది ఓ మాత్ర ఇమ్మని అడిగేను శ్రీమతిని. ఆవిడ హ్యాండ్‌బాగ్‌లో ఏవేవో మాత్రలుంటాయి కదా ఏదో ఒకటి ఇస్తుందిలే అని.

"ఏం తలనెప్పో తెలుసుకోకుండా ఎలా?" అంటూ ఆవిడ మా వీధిచివర్లో ఉన్న డాక్టర్‌గారి దగ్గరికి తీస్కెళ్లడం, ఆయన త్రేతాయుగం నాటి బి.పి. ఆపరేటస్‌ని నామీద ప్రయోగించి నాకు బి.పి. ఉందన్న చేదునిజం చెవిన వెయ్యడం, ఆ వెంటనే నన్నొక ద్వాపరయుగంనాటి వేయింగ్ మెషిన్‌మీదెక్కించి నా బరువు ఎక్కువ ఉందని వెక్కిరించి, బి.పి., బరువూ కవల పిల్లల్లాంటివనీ, రెండూ కలిస్తే మూడోది... అంటే షుగరు కూడా వస్తుందనీ భయపెట్టి తన ఫీజు తాను తీస్కుని మమ్మల్నిద్దర్నీ పంపేశాడు. అంతే! ఇక మొదలైంది మా ఆవిడ హడావిడి. అసలే తనకి న్యాచురోపతీలో డిప్లమో... అల్లోపతి, హోమియోల్లో అరకొర నాలెడ్జి ఎలాగూ ఉంది. తనకి తెలిసిన 'పతీ'లన్నిటినీ ఈ పతి మీద ప్రయోగించాలని డిసైడైపోయినట్టు ఆమె కొంగు బిగించిన విధానం చూస్తే నాకర్థమైంది.

ఆ మర్నాడే నా బర్త్‌డే గిఫ్ట్‌గా ఈ ఎక్సర్‌సైజ్ సైకిల్‌ని కొని, నాకష్టాలకి శ్రీకారం



చుట్టింది శ్రీమతి.

ఓ టూ లీటర్ ఫుల్‌బాటిల్ తాగాక, కడుపు చెరువైనట్టనిపించి నోట్లో నీళ్లూర్తుండగా దీనంగా అన్నాను. "ఏంటీది జలజా! బర్త్‌డే పూటా ఇలా చేపలా నీళ్లు తాగిస్తావా వాచేత? ప్రొద్దున్నే పొగలుకక్కే కాఫీతో మొదలవుతుందనుకుంటే..."



దాంతో జలజకి కాస్త కోపం వచ్చినట్టుంది. "మీ మంచికోరి చేస్తుంటే అలా అంటారేం? నేచురో థెరపీలో డిప్లమో చేసిన భార్య దొరకడం ఎంత అదృష్టం? ఓ పక్క ఎక్సర్‌సైజూ, ఓ పక్క వాటర్ థెరపీ చేస్తూ మరోపక్క మొలకెత్తిన పెసలు, ఉప్పులేని కూరలు తింటూ ఉంటే రమ్మన్నా ఏ జబ్బూ మీదరికే రాదు. అలవాటయ్యేదాకా మొదట్లో అలాగే ఉంటుంది" అంటూ క్లాస్ పీకింది.

"మీ అమ్మ, నాన్న భలేపేరు పెట్టేరోయ్ నీకు... జలజాక్షి అని. జలం తెగ తాగించేస్తున్నావ్!" అన్నాను ఏడవలేక నవ్వుతూ.

"ఔనుమరి! జలం అంటే ఏంటనుకున్నారు? జలం జీవన సూత్రం. పరమ పవిత్రం. జలం సర్వ విషహారం. జలంలో ఉన్నన్ని మినరల్సూ, అవీ... ఇవీ... ఎందులో ఉన్నాయండీ... జలం జలం అని స్మరిస్తూ తాగితే ఎంత జలమైనా తిమింగలంలా మింగెయ్యగలం..."

"అబ్బ! 'జలం' 'జలం' 'జలం' అని వరసగా అన్నిమార్లు అనకే... వేరే అర్థాలొస్తాయి" అంటూ ఆ మిగిలిన రెండో రెండు లీటర్ల బాటిల్‌నీ నోట్లో ఊరిన లాలాజలంతో కలిపి మింగేశాను.

"త్వరగా స్నానంచేసి రండి. బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేస్తాను" ఊరడింపుగా అంది జలజ. సలుపు

**పేరాల శ్రవణ్‌కుమార్**

తున్న ఒంటితో స్నానం చేస్తూ తొణకని నిండు కుండలా ఉన్న నా జలోదరాన్ని బెంగగా నిమురుకుంటూ ఆలోచిస్తున్నాను. మా ఆవిడ అంటుంది... అదేదో సర్వేలో తేలిందట! భారతీయ గృహిణి చేసే రకరకాల ఇంటిపనులే ఆవిడకి ఎక్సర్‌సైజుల్లా పన్జేసి ఆటోమేటిక్‌గా బరువుని తగ్గించేస్తాయిట!

మరి నేను ఆదరాబాదరా కుక్కలా బస్‌స్టాపుకి పరిగెట్టేది, బస్‌స్టాపులో కొంగలా బస్ కోసం వెయిట్‌చేసిందీ, బాసు పిల్చేడని, అదనీ, ఇదనీ ఆఫీసులో కంగారుగా కంగారూలా పరిగెట్టినదీ ఇవేం లెఖ్ఖలోకి రావు కాబోలు. అనుకుంటూనే స్నానం కానిచ్చి... యోగా, సైక్లింగ్‌ల దెబ్బకి పట్టేసిన కండరాలతో అదో మాదిరిగా నడుస్తూ డైనింగ్ హాల్ చేరుకున్నాను. ఇన్ని గుగ్గిళ్లూ, ఒక దానిమ్మ చెక్కా..." ఆహా! బర్త్‌డే పూటా అదిరిపోయిందోయ్ బ్రేక్‌ఫాస్టు! లాస్టియర్ నా బర్త్‌డే నాడు పెసరట్లేశావ్! ఈసారి 'రా'గా పెసలే తినిపిస్తున్నావ్... ఆ రోజు వేడి పాయసం, ఈ రోజు చోడిజావ... అవునూ, ఈ గుగ్గిళ్లు దేనికటా! ఇవి తిని గుర్రంలా పరిగెత్తి ఆఫీసు కెళితే అటు బస్సు ఖర్చూ తగ్గుతుంది, ఇటు బరువూ తగ్గుతుందని ప్లానా?" సినికల్‌గా సెటైరికల్‌గా ఎత్తిపొడిచేను శ్రీమతిని.

అదేం పట్టించుకోలేదు జలజాక్షి. "పుట్టిన రోజూ, పెళ్లిరోజూ అంటూ తినేస్తూ ఉంటే ఎప్పటికండీ బరువు తగ్గేది? ముందే చెప్తున్నా. మీరు బరువు తగ్గేదాకా మధ్యాహ్నం బాక్సులో కూడా పుల్కాలు, ఉడకేసిన బీరకాయ ముక్కలే ఉంటాయి మరేం ఊహించుకోకండేం! అంతా మీ మంచికే కదండీ!" పద్యం చివర మకుటంలా అన్నిటికీ చివర 'మీ మంచికే కదండీ' అని నా నోరు మూయించేస్తుంది జలజాక్షి. బ్రేక్‌ఫాస్ట్ ఎల్లాగో కానిచ్చి బస్‌స్టాప్‌కి చేరుకున్నాను రాముడు మంచి బాలుడులా. అలవాటులేని శారీరకశ్రమ, దానికితోడు అపక్వాహారం... శరీరం అలసి సొలసి ఉందేమో ఆ అలసటకి నా కుడికన్ను అదరడం మొదలైంది. నా పక్కనే కాస్తంత దూరంలో బస్‌కోసం నిలబడ్డ బ్లూజీన్స్ అమ్మాయి అనుకోకుండా నా కళ్లలోకి చూసి, కన్ను కొట్టాననుకుందోఏమో మొహం మటమటా పెట్టుకుంది. అంతలో బస్ రావడం, నేను ఆ అమ్మాయి వెనకాలే కుంటుకుంటూ బస్ ఎక్కడం జరిగిపోయేయి. బస్ నిండా జనం. ఆ అమ్మాయి వెనకాలే నేను నిలబడ్డాను. బస్ జామ్మంటూ వెళ్తోంది. అంతలో... ఎక్సర్‌సైజుకి అలిసిన నాకుడికాలి కండ పట్టేసి నొప్పి చెయ్యడంతో ఆ నొప్పికి తాళలేక కుడికాలు కాస్త పైకి లేపానో లేదో నా ముందరే ఉన్న ఆ అమ్మాయి వెనక భాగానికి నా మోకాలు తగలడంతో ఆమె గిరుక్కున వెనక్కి తిరిగి, వెనకా ముందూ ఆలోచించకుండా నా చెంపమీద ఒక సిక్సర్ దెబ్బ పీకింది. పిక్కపట్టేసిన బాధ ఓ వేపు, పిల్ల చేతిదెబ్బ బాధ మరోవేపూ, అన్నిటినీ మించి అవమానభారం అన్నివేపులా బాధించడంతో గుక్కపట్టి ఏడవాలనిపించినా బలవంతాన దిగమింగి ఊరుకున్నాను.

"ఇందాక బస్‌స్టాప్‌లో కన్నుకొట్టినప్పుడే ఒకటి పీకాల్సింది. ఆలస్యం చేశాను" కొసరుగా కసురుకున్న ఆ అమ్మాయికి మద్దతుగా మరో

## గమనిక

సాహిత్య కార్యక్రమాల ఫొటోలు ప్రచురణార్థం పంపించేటపుడు ఆ కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం తప్పక ఉదహరించాలి. ఈ వివరాలు లేకుండా వచ్చే ఫొటోలు ప్రచురణకు స్వీకరించబడవని గమనించగోర్తాం.

- ఎడిటర్

రెండు మూడు గొంతులు జత కలిసాయి.

"ఛీ ఛీ! బర్త్డే పూట జరగాల్సిన సన్మానమా ఇది?" అని వగచి, వగరుస్తూ నా స్టాప్లో దిగి పిక్కలు చేత్తో రాసుకుంటూ ఆఫీసు చేరుకున్నాను. అంతటితో నా అవమానాల లిస్టు ఆగలేదు.

ఆఫీసులో నా సీట్లో కూర్చున్నానో లేదో అర్జెన్సీ... యమర్జన్సీ. బాత్రూంలోకి పరుగు తీశాను. అలా మరోసారి... ఇంకోసారి. మాటిమాటికీ వెళ్తొస్తున్న నన్ను వింతగా వినోదంగా చూస్తూ సెంకాలిలా కిసుక్కుమంటోంది పెళ్ళికాని ప్రైవేట్ ప్రేమలత. ఆవిడకి వత్తాసుగా ఎల్టీసీ సుబ్బారావు.

ఆ పక్కనే ఉండే రాజేశ్వర్ అడగనే అడిగేశాడు. "ఏం గణేష్గారూ! మాటిమాటికీ వెళ్ళొస్తున్నారు! షుగర్గానీ ఎటాక్ అయిందా?" అని.

"వాటర్ థెరపీ అని ఆరోగ్యానికి చాలా మంచిదిలే! దాని ఎఫెక్ట్. నీలాంటి వాడికి చెప్పినా అర్థంకాదు" అనేసి మాట దాటేశాను ఆ పూటకి.

ఓ రెండు రోజులు అలా గడిచింది. నా మీద సుబ్రావ్ తదితరులు ఏం చెప్పేరోగానీ ఆఫీస్ మేనేజర్ తన గదికి రమ్మని కబురెట్టేడు.

"ఏంటి గణేష్! ఆఫీస్ పని మానేసి మాటి మాటికీ బాత్రూంలో కూర్చుంటున్నావట! నీ టేబిల్ మీద ఫైల్స్ కదలడంలేదు. ఇలా ఐతే ఎలా? ఏదైనా హెల్త్ ప్రాబ్లం ఐతే ఓ నెల రోజులు ఎర్న్డ్ లీవ్ పెట్టరాదూ! నిన్ను చూసి అందరూ వర్క్ ఎగ్గొడ్తున్నారు" అంటూ మెత్తగా మందలించాడు. అతని మాటలు శూలాల్లా గుచ్చుకున్నాయి. "వాటర్ థెరపీ! అనుకుంటూ పళ్ళు నూరుకున్నాను ఆవేశంగా.

ఇంటికెళ్లగానే జలజాక్షిమీద ఒంటికాలిపై లేచాను.

"అసలు నీ వాటర్ థెరపీ వల్లే ఇదంతా. నీ మూలాన మా మేనేజర్ నన్ను లీవ్ పెట్టెయ్యమంటున్నాడు. రేపట్నించీ నాకు బాత్రూం బంద్ అట కూడాను!"

జలజాక్షి సెలయేరులా నవ్వింది. "రేపు, ఎల్లుండి, శని ఆదివారాలే కదండీ. హాయిగా ఇంట్లో ఎన్నిసార్లైనా వెళ్లండి. మీ మేనేజర్గారి భార్య మహాలక్ష్మిగారు మా లేడీస్క్లబ్ మెంబరే. మీకు బాత్రూం పర్మిషన్ ఇమ్మని వాళ్లాయనతో చెప్పమని నేను చెప్తాలెండి రేపు!"

"ఛీ ఛీ! నేను బాత్రూంకెళ్లడానికి మా బాస్ వాళ్లావిడకి మా ఆవిడ ద్వారా రికమెండేషను! హా! నా బ్రతుకు చెడ!" దీనంగా అనుకున్నాను. సోమవారం రానే వచ్చింది. ఉదయమే మూడు లీటర్ల జలం తాగేదాకా జలజాక్షి నన్నొదిలి పెట్టలేదు. 'ఆఫీసులో ఎలాగో' అన్న దిగులు సతాయిస్తున్నా జలంధరుల్లా నీళ్లుతాగి ఆఫీస్ కెళ్లేను.

వెళ్లగానే ఎమర్జన్సీ. అర్జంటుగా బాత్రూంకి పరిగెత్తేను సముద్రాలన్నిటినీ తాగేసిన అగస్త్యుడిలా. ఆశ్చర్యం! బ్రెయిన్ ఆఫ్ ఆంధ్రాలో ఐదులక్షలు గెలచుకున్న విజేతలా ఫీలవుతూ బాత్రూంలోంచి రిలీఫ్గా బైటికొస్తున్నాడు మా ఆఫీస్ మేనేజర్.

నా బుర్రలో ట్యూబులైటు వెలిగింది. 'అంటే... నిన్న మా ఆవిడ జలజాక్షి... మహిళా మండలి మీటింగులో మా మేనేజరుగారి భార్యకి వాటర్ థెరపీ మంత్రం బోధించి, వాళ్లాయనకీ అలవాటు చేయించిందన్న మాట.

వా! జలజా! ఏం బుర్రనీది...?' నేనిలా ఆలోచిస్తూ ఆనందిస్తూ ఉండగానే మా మేనేజర్ మరో రెండుసార్లు బాత్రూం చక్కర్లు కొడ్తూ నన్ను చూసి ఇబ్బందిగా నవ్వేడు. ●